

క్యాంపు కార్యాలయం నుంచి పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్



అవును... మాది కుటుంబ పాలనే!

సీఎం స్టాలిన్

● నీంగళ్ నలమా పథకానికి శ్రీకారం

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే రాజకీయ ప్రత్యర్థులు చెబుతున్నట్టే రాష్ట్రంలో కుటుంబ పాలనే కొనసాగుతోందని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఉన్నత స్థితికి తెచ్చేందుకు తాపత్రయపడుతున్న పాలనే ద్రావిడ తరహా పాలన అని సీఎం స్టాలిన్ అన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం నీంగళ్ నలమా పేరిట కొత్త పథకానికి ఆయన శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలితాలు సక్రమంగా ప్రజలందరికీ అందుతున్నాయా లేదా అని నిర్ధారించుకునే దిశగా ఈ పథకం అమలు కోసం www.neengalnalamaa.tn.gov.inను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం ద్వారా లబ్ధిపొందుతున్న శివగంగ జిల్లా నెర్కుప్పైకి చెందిన ధనలక్ష్మి అనే గృహిణితో ఫోన్‌లో సంభాషించారు. అల్పాహార పథకం ద్వారా లబ్ధిపొందుతున్న తిరువళ్లూరు సేరాంజేరి పంచాయతీ పాఠశాల విద్యార్థి భవనేష్ తండ్రి ప్రభుతో ఫోన్‌లో మాట్లాడారు. ఇదే విధంగా వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారితో సీఎం ఫోన్‌లో మాట్లాడి సక్రమంగా అమలవుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆయన వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగిస్తూ...

డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఆచితూచి ప్రజలకు అవసరమైన పథకాలను ఎంపిక చేసి వరుసగా అమలుచేస్తోందన్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రారంభించిన పథకమే 'నీంగళ్ నలమా?' (మీరు కుశలమేనా?) అన్నారు. ఈ పథకం పేరునుబట్టే ప్రజలపైన ప్రభుత్వానికి ఉన్న అభిమానం తెలుసుకోవచ్చన్నారు. మూడేళ్లలో డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో అత్యధికంగా ప్రజలు లబ్ధి పొందిన పథకాలను పరిశీలిస్తే వాటిలో మహిళల వెలుగుబాట పయనం, పుదుమై పెణ్, బడిపిల్లల అల్పాహార పథకం, కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ, ఇళ్ల వద్దకే విద్య, వైద్యం, ఒలంపిక్ అన్వేషణ, నాన్ ముదల్వన్, మీ నియోజకవర్గంలో సీఎం, ముదల్వరిన్ ముగవరి (సీఎం చిరునామా), క్షేత్రపరిశీలనలో ముఖ్యమంత్రి వంటి పథకాలు అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పారు. ద్రావిడ తరహా ప్రభుత్వ పాలనలో ప్రకటించిన పథాకల వల్ల లబ్ధిపొందనివారే లేరు, తాను పర్యటించే ప్రతిచోటా తనను కలుసుకునే ప్రజల ముఖాల్లో సంతోషాన్ని చూడగలుగుతున్నానని చెప్పారు.

ఇవిగో ఫలితాలు..

తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మారుమూల గ్రామాల్లోనూ సామాన్య ప్రజలు కూడా ప్రయోజనం పొందుతున్నారని సీఎం చెప్పారు. వెలుగుబాట పయనం ద్వారా ఇప్పటివరకూ మహిళలు ప్రతినెలా రూ.888ను పొదుపు చేయగలుగుతున్నారని, ప్రజల వద్దకే వైద్యం పథకం ద్వారా కోటిమందికి పైగా లబ్ధిపొందారని చెప్పారు. సీఎం అల్పాహారం ద్వారా 16 లక్షల మంది బాలబాలికలు పస్తులు లేక విద్యనభ్యసిస్తున్నారని, పుదుమై పెణ్ పథకం ద్వారా 4.81లక్షల మందికిపైగా విద్యార్థినులు ప్రతినెలా రూ.వెయ్యి ఆర్థిక సాయాన్ని పొంది డిగ్రీలు సంపాదించుకోనున్నారని, నాన్ ముదల్వన్ ద్వారా రెండేళ్లలో 2.28లక్షల మంది యువకులు తమ ప్రతిభాపాటవాలను పెంపొందించుకున్నారని తెలిపారు. ఇక ఇళ్ల వద్దకే విద్య పథకం ద్వారా 24.86లక్షల మంది బడిపిల్లలు ప్రయోజనం పొందారన్నారు. అలాగే రాష్ట్రంలో 62 లక్షలకు పైగా ఇళ్లకు కొళాయి కనెక్షన్లు పొందారని, కొత్తగా 2 లక్షల మంది రైతులు ఉచిత విద్యుత్ పొందుతున్నారన్నారు. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు మేలు చేసే పథకాలను ద్రావిడ తరహా పాలనను అందిస్తుంటే తమ ప్రత్యర్థులు కుటుంబ పాలన అనడం విడ్డూరంగా ఉందన్నారు.

మోదీ నోట పచ్చి అబద్దాలు...

ఇటీవల నగరంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ అసత్యాలను మాట్లాడి అభాసుపాలయ్యారని స్టాలిన్ విమర్శించారు. కేంద్రప్రభుత్వం తన నిధులను రాష్ట్రప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తే అవినీతి జరుగుతుందని భావించే నేరుగా ప్రజలకు నిధులను అందిస్తున్నామనడం గర్హనీయమన్నారు. రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా పంపిణీ చేసిన నిధుల వివరాలను ఆయన ప్రకటించి ఉంటే బాగుండేదన్నారు. చెన్నై సహా నాలుగు జిల్లాలు మిచౌంగ్ తుఫానుకు, తిరునల్వేలి సహా నాలుగు జిల్లాలు వరదలకు నష్టపోతే కేంద్రప్రభుత్వం నిధులివ్వలేదని గుర్తు చేశారు. తుఫాను, వరద బాధితులను ఆదుకునేందుకు రూ.37 వేల కోట్ల మేరకు నిధులివ్వాలని అడిగితే ఇప్పటి వరకు పైసా విడుదల కాలేదన్నారు. కేంద్రం నిధులు విడుదల చేయకున్నా రాష్ట్ర ప్రభుత్వమే రూ.3,406 కోట్లతో వరద, తుఫాను బాధితులను సకాలంలో ఆదుకుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని తన కుటుంబంగా భావించి అందరినీ ఆదుకోవడమే డీఎంకే తరహా ద్రావిడ పాలన ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, అదనపు ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యదర్శి ఎన్. మురుగానందం, ముదల్వరిన్ ముగవరి శాఖ ప్రత్యేక అధికారి డి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.





పొత్తు కోసం మోదీ ఫోన్

ససేమిరా కుదరదన్న ఎడప్పాడి ● అన్నామలైకి ఢిల్లీ పెద్దల కబురు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకునే దిశగా ఫోన్ ద్వారా భేటీకి ప్రయత్నించిన ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సున్నితంగా తిరస్కరించారు. బీజేపీతో మళ్లీ పొత్తుపెట్టుకోమంటూ మోదీతో కాకుండా రాష్ట్ర బీజేపీ నేతలకు తేల్చి చెప్పారు. దీంతో కొత్త పార్టీలతో కొత్త కూటమి ఏర్పాటుకు చర్చలను బీజేపీ ముమ్మరం చేసింది. కూటమి ఏర్పాటు కోసం ఢిల్లీ పెద్దలు అన్నామలైను హుటాహుటిన ఢిల్లీకి పిలిపించినట్లు తెలుస్తోంది. అన్నాడీఎంకే, బీజేపీ కూటమికి బీటలు వారడంతో, రెండు పార్టీలు ప్రత్యేక కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయి.

తగినన్ని విజయాలు

దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ తగినన్ని విజయాలు సాధించలేకపోతోంది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో బొటాబొటి సీట్లతో సరిపెట్టుకుంటోంది. అందువల్ల ఉత్తరాది రాష్ట్రాలపై బీజేపీ దృష్టి సారించింది. దక్షిణాది రాష్ట్రాల కన్నా ఉత్తరాది రాష్ట్రాలకు అధికంగా నిధులు కేటాయిస్తోంది. అలాగే, కొన్ని పార్టీలను విడగొట్టి ప్రత్యేక చిహ్నంతో కొత్త పార్టీని స్థాపించి, ఆ పార్టీతో కూటమి ఏర్పాటుకు సిద్ధపడుతోంది. అందువల్ల 'ఇండియా' కూటమిలోని పలు పార్టీలు బయటకు వచ్చి ఎన్డీఏ కూటమిలో చేరుతున్నాయి. ఆ క్రమంలోనే రాష్ట్రంలో అన్నాడీఎంకేతో కూటమి ఏర్పాటుకు బీజేపీ అధిష్ఠానం యత్నిస్తోంది. అందువల్ల ఓ.పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్‌ను కూటమిలో చేర్చుకోకుండా వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచింది. ఎన్ని అవమానాలు ఎదురైనా కూటమిలో చేరడం కోసం ఆ ఇద్దరు నేతలు బీజేపీ కార్యాలయ ప్రవేశద్వారం ముందు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా ఎడప్పాడిని సముదాయించే పనిలో బీజేపీ నేతలు ఉన్నారు.

ఎడప్పాడికి ప్రధాని ఫోన్...

ఈ నేపథ్యంలో, స్థానిక గ్రీన్‌వేస్ రోడ్డులోని ఈపీఎస్ ఇంటికి మంగళవారం రాత్రి ప్రధాని నరేంద్రమోదీ ఫోన్ చేసి ఆయనతో పొత్తు విషయమై చర్చించినట్లు సమాచారం. అదే సమయంలో ఢిల్లీ నుంచి ఫోన్ అని తెలియడంతో ఈపీఎస్ మాట్లాడేందుకు నిరాకరించినట్లు తెలిసింది. మోదీ తరఫున అన్నాడీఎంకేకు చెందిన ఇద్దరు సీనియర్ నేతలను సంప్రదించి, కూటమి ఏర్పాటుపై నిర్ణయాన్ని తెలియజేయాలని కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం మైనార్టీలు పార్టీ పట్ల సానుభూతితో ఉన్నారని, అదే సమయంలో రాష్ట్రానికి బీజేపీ ఏం చేయలేదని భావిస్తున్నారని, ఇప్పుడు ఆ పార్టీతో జతకడితే తీవ్రనష్టం వాటిల్లుతుందని ఈపీఎస్ భావిస్తున్నారు. బీజేపీతో కూటమి విషయమై చేసిన ప్రకటన వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదని ఈపీఎస్ స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ అధిష్ఠానం పిలుపుతో అన్నామలై ఢిల్లీ చేరుకున్నారు. ఒకవేళ అన్నాడీఎంకే నుంచి సానుకూలత రాని పక్షంలో కొత్త పార్టీలను కలుపుకొని కూటమి ఏర్పాటు చేయాలని బీజేపీ భావిస్తోంది. తమ కూటమిలోకి మరిన్ని పార్టీలను ఆహ్వానించాలని అన్నాడీఎంకే తన ప్రయత్నాలు తీవ్రతరం చేసింది.

అన్నాడీఎంకే కూటమిలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్త పార్టీలు ప్రధాన పార్టీల కూటములలో చేరుతున్నాయి. ఆ క్రమంలోనే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష అన్నాడీఎంకే నాయకత్వంలోని కూటమిలో చేరనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ని ఆ పార్టీ నిర్వాహకులు కలుసుకుని లోక్‌సభ ఎన్నికల్లో ఈపీఎస్ కూటమికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యదర్శి కదిరవన్, ఇతర నాయకులు ఈపీఎస్‌ను ఆయన నివాసగృహంలో కలుసుకుని శాలువలతో సత్కరించారు. ఈ ఎన్నికల్లో రామనాథపురం నియోజకవర్గంలో పోటీ చేయాలని భావిస్తోందని కదిరవన్ తెలిపారు. డీఎంకే కూటమిలో తమకు గౌరవ మర్యాదలు లేకపోవడం వల్లే అన్నాడీఎంకే కూటమికి మద్దతునిస్తున్నామని చెప్పారు.



శీమాన్, వైగో, అన్బుమణి రాందాస్, జీకే వాసన్

చిహ్నం కోసం పోరాటం

పెరంబూర్, మార్చి 6: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని పలు పార్టీలు తమ చిహ్నాలు పొందేందుకు పోరాడుతున్నాయి. ముఖ్యంగా నామ్ తమిళర్ కట్చి, ఎండీఎంకే(బొంగరం), తమిళ మానిల కాంగ్రెస్(సైకిల్) తదితర పార్టీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఆ పార్టీలకు ఎందుకంత ఆతృత? అనే విషయం పరిశీలిద్దాం...

ప్రత్యేక ఓటు బ్యాంకు, గుర్తింపు కలిగిన పార్టీలకు మాత్రమే శాశ్వత చిహ్నం కేటాయిస్తారు. రాష్ట్రానికి సంబంధించి డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ, సీపీఎం, సీపీఐ, డీఎండీకే, కాంగ్రెస్ తదితర పార్టీలు మాత్రమే అంగీకరించబడిన పార్టీలుగా ఉన్నాయి. ఇక, పీఎంకే, ఎండీఎంకే, డీపీఐ, ఏఎంఎంకే, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి, మక్కల్ నీది మయ్యం, నామ్ తమిళర్ కట్చి, పుదియ తమిళగం, టీఎంసీ, తమిళనాడు కొంగు ఇళైంజర్ పేరవై, ఇండియ జననాయగ కట్చి, తమిళగ వాల్వురిమై కట్చి, మనిదనేయ మక్కల్ కట్చి సహా పలు పార్టీలు అంగీకారం కోసం అర్హత కలిగిన పార్టీలుగా ఉన్నాయి.

చిహ్నం కేటాయించే అధికారం ఈసీకే...

అంగీకారం పొందని పార్టీలకు ఎన్నికల సంఘం చిహ్నాలు కేటాయిస్తుంది. అందులో తమకు ఏ గుర్తు కావాలన్న కోర్కెను ఆయా పార్టీలు ఈసీకి లేఖ ద్వారా తెలియజేసుకొనే అవకాశముంది. అందుకు నిర్ణీత కాలవ్యవధిని ఈసీ కల్పిస్తోంది. ఒకటి కంటే ఎక్కువ పార్టీలు ఒకే గుర్తును కోరితే ప్రాధాన్యం ఆధారంగా గుర్తును ఎన్నికల సంఘం కేటాయిస్తుంది. నామ్ తమిళర్ కట్చి తమకు చెరకు రైతు గుర్తు కేటాయించాలని నిర్ణీత సమయంలో కోరకపోవడంతో చిహ్నాన్ని కోల్పోవాల్సి వచ్చింది. కర్ణాటక రాష్ట్రంలోని ఓ పార్టీ అదే గుర్తు కోరడంతో ప్రాధాన్యం ఆధారంగా ఆ పార్టీకి కేటాయించారు. ఈ గుర్తు కోల్పోవడం నామ్ తమిళర్ కట్చికి కొంత ఇబ్బందేనని రాజకీయ విశ్లేషకులు అంచనా. ప్రస్తుతం ఆ గుర్తు కోసం పార్టీ నాయకుడు శీమాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పార్టీ గుర్తింపు పొందాలంటే ఓటు బ్యాంక్‌ను పెంచుకోవాల్సి ఉంది.

అంగీకారం పొందడం...

శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు పొందే ఓట్ల శాతం ఆధారంగా ఆయా పార్టీలకు చిహ్నాలు కేటాయిస్తుంటారు. ముఖ్యంగా, జాతీయ పార్టీలుగా గుర్తింపు పొందేందుకు ఆయా పార్టీలు నాలుగు, అంతకంటే ఎక్కువ రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం వహిస్తుండాలి. అలాగే, లోక్‌సభ ఎన్నికల్లో 2 శాతం ఓట్లు పొందే పార్టీ జాతీయ హోదా పొందుతుంది. రాష్ట్ర పార్టీ అంగీకారం పొందేందుకు శాసనసభ ఎన్నికల్లో 6 శాతం ఓట్లు, రెండు శాసనసభ నియోజకవర్గాల్లో విజయం సాధించి ఉండాలి. అలాగే, లోక్‌సభ ఎన్నికల్లో 6 శాతం ఓట్లు, ఒక నియోజకవర్గంలో గెలుపొందాలి. ముఖ్యంగా, శాసనసభ ఎన్నికల్లో మొత్తం స్థానాల్లో 3 శాతం స్థానాల్లో గెలుపొందాల్సి ఉంది (రాష్ట్రంలో 234 నియోజకవర్గాల్లో 7 స్థానాల్లో విజయం సాధించాలి). కానీ, ఈ ఓట్ల శాతం పార్టీలు పొందలేని పరిస్థితుల్లో గుర్తింపు కోల్పోతాయి. అందులో, 2014 పీఎంకే, 2006లో ఎండీఎంకేలు రాష్ట్ర పార్టీలు అనే అంగీకారం కోల్పోయాయి. ఆయా పార్టీలు తమ అంగీకారం నిలబెట్టుకొనేందుకు తమ చిహ్నంపైనే పోటీ చేయాలని పోరాడుతున్నాయి. అందువల్లే పోటీచేసే సీట్ల సంఖ్య పెంచాలని, ప్రత్యేక చిహ్నంతో పోటీచేసి ఓటు శాతాన్ని పెంచుకోవాలని ఆయా పార్టీలు భావిస్తున్నాయి.

పుదుచ్చేరిలో బాలికపై అత్యాచారం, హత్య

● ఐదుగురు బాలురు సహా ఆరుగురి అరెస్టు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో తొమ్మిదేళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి ఆమెకు నిప్పంటించి దారుణంగా హతమార్చిన కేసులో ఐదుగురు బాలురు సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి ఎన్ఆర్ రంగస్వామి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి రూ.20లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. పుదుచ్చేరిలో నివసిస్తున్న ఓ బాలిక (9) ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఈనెల 2వ తేదీ సాయంత్రం ఇంటి ముందు ఆటలాడుతుండగా అదృశ్యమైంది. తల్లిదండ్రులు అన్ని చోట్లా వెదికినా ఆచూకీ కనుగొనలేకపోయారు. చివరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీని కనుగొనాలని డిమాండ్ చేస్తూ స్థానికులు, కుటుంబీకులు సోమవారం రాస్తారోకో జరిపారు.పోలీసులు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా బాలిక ఆచూకీని కనుగొనేందుకు ప్రయత్నాలు సాగించారు. ఈ నేపథ్యంలో ఓ మురుగు కాల్వ సమీపంలో ప్రైవేటు పశువుల పాక వద్ద మంగళవారం ఉదయం బాలిక మృతదేహం పడి ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు.మృతదేహంపై గాయాలుండడంతో అత్యాచారం జరిపి హతమార్చి ఉంటారని కుటుంబీకులు ఆరోపిస్తూ నేరస్తులను అరెస్టు చేయాలని రాస్తారోకో జరిపారు. పోలీసులు జోక్యం చేసుకుని వీలైనంత త్వరగా నేరస్థులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే దర్యాప్తును ముమ్మరం చేసి బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఐదుగురు బాలురు సహా ఆరుగురిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

● హైకోర్టులో అధికార భాషగా తమిళం

ప్రభుత్వానిదే నిర్ణయాధికారం

ప్రధాన న్యాయమూర్తి ప్రకటన



చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో తమిళభాషను అధికారిక భాషగా, వాదనా భాషగా అమలు చేసే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని ప్రధాన న్యాయమూర్తి సంజయ్ గంగాపూర్‌వాలా స్పష్టం చేశారు. హైకోర్టులో తమిళభాషను అధికారిక భాషగా అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 28 నుంచి సీనియర్ న్యాయవాది భవత్‌సింగ్ నాయకత్వంలో న్యాయవాదులు ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీఎంకే తరఫు న్యాయవాది కే బాలు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ఎదుట హాజరై హైకోర్టులో తమిళ భాషను అధికారిక భాషగా ప్రకటిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ విషయమై న్యాయవాదులు గత కొద్ది రోజులుగా నిరాహార దీక్షలు కూడా చేస్తున్నారని, వారిలో ఇద్దరు న్యాయవాదులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్సలందుకుంటున్నారని చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్‌వాల్, న్యాయమూర్తి భరత్‌చక్రవర్తితో కూడిన ప్రథమ ధర్మాసనం స్పందిస్తూ న్యాయమైన కోర్కె కోసమే న్యాయవాదులు ఆందోళన చేస్తున్నారని, వారి డిమాండ్ మానవతా దృష్ట్యా ఆమోద యోగ్యమేనన్నారు. అయితే చట్ట రీత్యా పరిశీలిస్తే ఈ విషయంలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమన్నారు. ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకోవాల్సిందే రాష్ట్ర ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లమంటూ ప్రభుత్వ ప్లీడర్ ఎడ్విన్ ప్రభాకరన్‌ను ధర్మాసనం ఆదేశించింది.

నేడు ఎస్బీఐ కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ ధర్నా

ప్యారీస్, మార్చి 6: ప్రజారంగ సంస్థలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు చేపట్టనుంది. ఈ మేరకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై విడుదల చేసిన ప్రకటనలో... బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వాహకుల తీరును ఖండిస్తూ గురువారం ఉదయం 10 గంటలకు అన్ని జిల్లా కేంద్రాలు, తాలూకా కార్యాలయాల్లో ఎస్బీఐ బ్యాంక్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టనున్నామన్నారు. స్థానిక నుంగంబాక్కం కాలేజి రోడ్డులో ఎస్బీఐ రీజియన్ కార్యాలయం ఎదుట తన ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు ధర్నా జరుగుతుందని సెల్వపెరుందగై తెలిపారు.

సమాచార దర్శిని

ఎన్నూర్ హార్బర్‌కు పురస్కారం

ఐసిఎఫ్, మార్చి 6: స్థానిక ఎన్నూర్ కామరాజర్ హార్బర్‌కు కేంద్ర ప్రభుత్వ పురస్కారం దక్కింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల సంస్థలను ప్రోత్సహించేలా ఆ సంస్థల ఉత్పత్తులను ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేసే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద వస్తువుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఎక్కువగా కొనుగోలు చేసే శాఖలకు కేంద్ర ప్రభుత్వం పురస్కారాలు అందజేస్తోంది. ఆ ప్రకారం, 2022-23లో ఎక్కువ వస్తువులు కొనుగోలు చేసినందుకు ఎన్నూర్ హార్బర్‌కు పురస్కారం లభించింది.

రూ.27 కోట్లతో బస్ డిపో

ఐసిఎఫ్, మార్చి 6:స్థానిక తండయార్‌పేటలో రూ.2 కోట్లతో ఆధునిక బస్ డిపో ఏర్పాటుకానుంది. తిరువొత్తియూర్ హైరోడ్డులో ఉన్న తండయార్‌పేట బస్ డిపోను ఆధునికీకరించాలని ఆర్కే నగర్ ఎమ్మెల్యేకు స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేయగా, అభివృద్ధి పనులను నిధులు కేటాయించారు. కొత్త డిపో నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను ఎమ్మెల్యే ఎబినేజర్ ప్రారంభించారు.

కన్నదాసన్ నగర్, ముల్లైనగర్... : కన్నదాసన్ నగర్, ముల్లైనగర్ బస్టాండ్ల ఆధునికీకరణ పనులు రూ.20 కోట్లతో ప్రారంభమయ్యాయి. కొడుంగైయూర్ కన్నదాసన్‌నగర్‌లో ఉన్న బస్టాండ్ 1.31 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. వ్యాసర్పాడి ముల్లైనగర్‌లో ఉన్న బస్టాండ్ 1.41 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. శిథిలావస్థకు చేరుకున్న ఈరెండు బస్టాండ్ల ఆధునికీకరణకు రవాణాశాఖ చర్యలు చేపట్టింది. కన్నదాసన్‌నగర్ బస్టాండ్‌కు రూ.13.40 కోట్లు, ముల్లైనగర్ బస్టాండ్‌కు రూ.6.60 కోట్లను కేటాయించింది. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయనున్నారు.

రేపు సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, మార్చి 6: గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు శుక్రవారం మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ జరగనుంది. ఈ పోస్టుల భర్తీకి 2022జూలైలో రాతపరీక్ష జరిగింది.అభ్యర్థుల మార్కులు, ర్యాంకుల వివరాలను ఫిబ్రవరి 24వ తేది విడుదల చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ ఈనెల 8వ తేది బ్రాడ్‌వేలో ఉన్న టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరగనుంది. వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 6: సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు అర్హులు ఈ నెల 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) తెలిపింది. రాష్ట్రప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పని చేసే ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1,768 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. నెల వేతనం రూ.20,600 నుంచి రూ.75,900 వరకు అందిస్తారు. ప్లస్‌టూలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత, రెండేళ్ల టీచర్ ట్రైనింగ్ డిప్లొమా కోర్సు, టెట్ ఫస్ట్ పేపర్‌లో ఉత్తీర్ణులైన వారు ఈ పోస్టుకు అర్హులు. ఔత్సాహికులు జూన్ 23వ తేది జరగనున్న రాతపరీక్షకు ఈనెల 15వ తేదిలోపు టీఆర్బీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

డెల్టా జిల్లాలకు కావేరి జలాలు

ఐసిఎఫ్, మార్చి 6: రాష్ట్రంలో కావేరి డెల్టా జిల్లాలకు ఫిబ్రవరిలో విడుదల చేయాల్సిన 2.50 టీఎంసీల కావేరి నదీ జలాలకుగాను ఇప్పటివరకు 0.66 టీఎంసీలను మాత్రమే కర్ణాటక ప్రభుత్వం విడుదల చేసింది. యేటా 177.25 టీఎంసీల నీటిని రాష్ట్రానికి కర్ణాటక ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. ప్రతి నెలా విడుదల చేయాల్సిన నీటి పరిమాణాన్ని కావేరి నిర్వాహక మండలి నిర్ణయిస్తోంది. జూన్‌లో నీటి విడుదల ప్రారంభమై మరుసటి ఏడాది మే వరకు కొనసాగుతోంది. ప్రస్తుత నీటి పంపిణీ కాలంలో 2023 జూన్ నుంచి ఈనెల 3వ తేది వరకు 170 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉండగా, 77.4 టీఎంసీలు మాత్రమే సరఫరా అయ్యాయి. 92.5 టీఎంసీలు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఫిబ్రవరిలో 2.50 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉండగా 0.66 టీఎంసీలు మాత్రమే విడుదల చేసింది.

హ్యాకథాన్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 6: ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న హ్యాకథాన్ పోటీలకు ఉన్నత విద్య చదివే విద్యార్థులు ఈనెల 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2017 నుంచి యేటా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు మార్కెటింగ్ చేయదగిన కొత్త వస్తువుల నమూనాలు రూపొందించాల్సి ఉంటుంది. ఉత్తమ నమూనాలకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.25 వేలు, సర్టిఫికెట్లు అందిస్తారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను www.edininnovation.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాల్సి ఉంటుంది.

చెన్నై - బెంగళూరు వందే భారత్

● 12న ప్రారంభించనున్న పీఎం

ఐసిఎఫ్, మార్చి 6: చెన్నై - బెంగుళూరు వందే భారత్ రైలును ఈనెల 12వ తేది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దక్షిణ రైల్వేలో చెన్నై సెంట్రల్ - కోవై, సెంట్రల్ - మైసూరు, సెంట్రల్ - విజయవాడ, ఎగ్మూర్ - నెల్లై, తిరువనంతపురం - కాసర్‌గోడ్ వంటి మార్గాల్లో వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, సెంట్రల్ - బెంగళూరుకు కొత్త వందే భారత్ రైలు సేవలను ప్రధానమంత్రి ఈనెల 12వ తేది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు.

రేపటినుంచి చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, మార్చి 6: మహాశివరాత్రి సందర్భంగా విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలోని పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో కొలువైఉన్న చదురగిరి మహాలింగం ఆలయానికి నాలుగు రోజులు భక్తులను అనుమతించనున్నారు. ఈనెల 8న మహాశివరాత్రి, ప్రదోషం సందర్భంగా 11వ తేది వరకు భక్తులు ఆలయాన్ని సందర్శించవచ్చు. ప్రదోషం సందర్భంగా సుందర మహాలింగ స్వామివారికి 21 రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నామని, 10 ఏళ్లలోపున్న, 60 ఏళ్ల పైబడిన వారు రావద్దని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. భక్తులు పాలిథీన్ కవర్లు, మంటలు చెలరేగే వస్తువులు కొండపై తీసుకెళ్లరాదు. కొండ మార్గంలోని జలపాతాల్లో స్నానాలు చేయరాదు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలున్న వారు రావద్దని అధికారులు కోరారు.

10న రైతుల రైల్‌రోకో

పెరంబూర్, మార్చి 6:ఢిల్లీలో ఆందోళన చేపడుతున్న రైతులకు మద్దతుగా ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా రైల్ రోకో చేపట్టనున్నట్లు కావేరి రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పీఆర్ పాండ్యన్ తెలిపారు. తంజావూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై డ్రోన్ల ద్వారా భాష్పవాయువు ప్రయోగించడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

గుట్కా ముడుపుల కేసు...
విచారణకు హాజరుకండి

సీబీఐ అధికారికి ప్రత్యేక కోర్టు ఆదేశం

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మునుపటి అన్నాడీఎంకే ప్రభుత్వహయంలో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గుట్కా ముడుపుల కేసుకు సంబంధించిన తదుపరి విచారణకు సీబీఐ విచారణాధికారి హాజరు కావాలంటూ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో నిషేధించిన గుట్కా వ్యాపారాన్ని సాగించేందుకు అధికారులకు ముడుపులు చెల్లించిన కేసుపై సీబీఐ విచారణ జరుపుతోంది. ఆ కేసులో గుట్కా టోకు వ్యాపారులు మాధవరావు, శీనివాసరావు, ఉమాశంకర్ గుప్తా, ఆహార భద్రతా శాఖ అధికారి సెంథిల్‌మురుగన్, కేంద్ర సుంకాల శాఖ అధికారి నవనీత కృష్ణ పాండ్యన్, ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్ నిందితులుగా ఉన్నారు. నగరంలోని సీబీఐ కోర్టులో ఛార్జిషీటు కూడా సమర్పించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు, మాజీ డీజీపీ, మాజీ నగర పోలీసు కమిషనర్ తదితరులపై కూడా 2022లో సీబీఐ కోర్టులో అదనపు ఛార్జిషీటు దాఖలైంది. అయితే ఆ ఛార్జిషీట్‌లోని వివరాలు అసమగ్రంగా ఉన్నాయని, దాన్ని సవరించి సమర్పించమంటూ సీబీకి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు, ఉన్నతాధికారులపై దాఖలైన కేసు విచారణ జరిపేందుకు కొద్ది మాసాలకు ముందు గవర్నర్ అనుమతి జారీ చేశారు. ఈ పరిస్థితులలో ఈ కేసు సీబీఐ కోర్టు న్యాయమూర్తి మలర్‌వాలీనా ఎదుట బుధవారం విచారణకు వచ్చింది. సీబీఐ తరపున అదనపు చార్జిషీటు దాఖలు చేయడానికి, మాజీ మంత్రులు, అధికారులపై విచారణ జరిపేందుకు అంగీకార పత్రం లభించలేదని ఆ శాఖ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈ వాదనలపై అసంతృప్తి ప్రకటించిన న్యాయమూర్తి తదుపరి విచారణకు సీబీఐ విచారణాధికారి తప్పకుండా హాజరై కేసు విచారణ ఏ దశలో ఎంతవరకు పూర్తయ్యిందన్న వివరాలను తెలుపాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నాడీఎంకే కూటమిలో
సీట్ల పంపకంపై డీఎండీకే చర్చలు ప్రారంభం



ప్యారీస్, మార్చి 6: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే చేరడం ఖరారైంది. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో అన్నాడీఎంకే - డీఎండీకే మధ్య రెండో విడత చర్చలు బుధవారం సాయంత్రం జరిగాయి. అన్నాడీఎంకే తరపున కేపీ మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, తంగమణి, వేలుమణి, బెంజిమెన్, డీఎండీకే తరపున ఇళంగోవన్, పార్థసారథి, మోహన్‌రాజ్ పాల్గొన్నారు. చర్చల అనంతరం డీఎండీకే ప్రిసీడియం చైర్మన్ ఇళంగోవన్ మాట్లాడుతూ.... అన్నాడీఎంకేతో జరిపిన రెండో విడత చర్చలు సాఫీగా సాగాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి విజయవంతమైన కూటమిగా ఉంటుందని, సీట్ల కేటాయింపునకు సంబంధించి మరో రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తామన్నారు. కాగా, 2019 పార్లమెంటు ఎన్నికల్లో డీఎండీకే పోటీ చేసిన ఉత్తర చెన్నై, కళ్లకుర్చి, తిరుచ్చి, విరుదునగర్ తదితర నాలుగు సీట్లు కేటాయించేందుకు అన్నాడీఎంకే అంగీకరించినట్లు సమాచారం. అదే సమయంలో ఉత్తర చెన్నైకి బదులుగా మరో స్థానం కేటాయించాలని డీఎండీకే తరపున కోరినట్లు సమాచారం.

ముగిసిన అన్నాడీఎంకే దరఖాస్తుల స్వీకరణ

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే తరపున పోటీ చేయాలనుకొనే ఆశావాహుల నుంచి దరఖాస్తు స్వీకరణ బుధవారం సాయంత్రం ముగిసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఉత్తర్వులతో, గత నెల 21వ తేది నుంచి స్థానిక రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. సుమారు 2,500 మంది దరఖాస్తులు సమర్పించారని, పార్టీ నియమించిన కమిటీ వాటిని పరిశీలించి, అర్హుల జాబితా అందించనుంది.

రూ.10.37 కోట్ల ఆస్తి పన్ను బకాయి

పోర్ట్ ట్రస్ట్ ఆఫీసుకు కార్పొరేషన్ నోటీసు



పోర్ట్ ట్రస్టు కార్యాలయం గోడపై నోటీసు అతికిస్తున్న కార్పొరేషన్ అధికారులు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్ రాజాజీసాలైలో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పోర్ట్ ట్రస్టు కార్యాలయం రూ.10 కోట్లకు పైగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ రెవెన్యూ విభాగం అధికారులు నోటీసులు అంటించారు. నగరంలో సక్రమంగా ఆస్తి పన్నులు చెల్లించిన కార్యాలయాలకు కార్పొరేషన్ అధికారులు నోటీసులు పంపుతున్నారు. ఆ మేరకు పోర్ట్ ట్రస్టు కార్యాలయం కార్పొరేషన్‌కు యేళ్ల తరబడి ఆస్తి పన్నులను సక్రమంగా చెల్లించలేదు. గడువులోగా బకాయిలు చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

నీలగిరి నియోజకవర్గంలో పోటీ

● డీఎంకే ఎంపీ రాజా

ప్యారీస్, మార్చి 6: నీలగిరి పార్లమెంటు నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేసే విషయం అధిష్ఠానం నిర్ణయిస్తుందని డీఎంకే ఎంపీ ఎ.రాజా తెలిపారు. తిరుప్పూర్ జిల్లా తిరుమురుగన్‌పూండిలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అత్తికడవు - అవినాశి ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వంలో ఈ ప్రాజెక్ట్ హడావుడిగా ప్రారంభించినా పనులు జరుగలేదని విమర్శించారు. నీలగిరి నియోజకవర్గంలో పోటీకి దరఖాస్తు చేసుకొనే హక్కు తనకు ఉందని రాజా అన్నారు.

అన్నాడీఎంకే కూటమిలో చేరే అవకాశం లేదు

● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్

ప్యారీస్, మార్చి 6: ఎన్ని సార్లు ఆహ్వానించినా అన్నాడీఎంకే కూటమిలో చేరే ప్రసక్తే లేదని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ స్పష్టం చేశారు. డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కిరాకపోవడంతో డీపీఐ అసంతృప్తిగా ఉన్నట్లు, దానిని ఉపయోగించి డీపీఐని తమ కూటమిలో చేర్చుకొనేందుకు అన్నాడీఎంకే ప్రయత్నిస్తోందని వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలపై తిరుమావళవన్ స్పందిస్తూ... డీఎంకే కూటమిలో తాను ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే - బీజేపీ మధ్య పోటీ అంటూ మాయా ప్రపంచం సృష్టిస్తున్నారని ఎద్దేవా చేశారు.

మహిళా దినోత్సవం రోజున టీవీకే సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్యారీస్, మార్చి 6: నటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో రాజకీయ పార్టీ స్థాపించిన విషయం తెలిసిందే. గత నెల 2వ తేది పార్టీ ప్రకటించిన నేపథ్యంలో, ఈసీ అంగీకరించిన వెంటనే పార్టీ పతాకం, చిహ్నం తదితరాలు వెల్లడిస్తామని ప్రకటించారు. అదే సమయంలో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో టీవీకే పోటీ చేయడం లేదని, అలాగే, ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని, 2026 శాసనసభ ఎన్నికల్లో రంగంలోకి దిగుతున్నట్లు ప్రకటించారు.రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేలా 2కోట్ల మందిని సభ్యులుగా చేర్చాలని నిర్ణయించారు. తొలుత ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందనే వార్తల నేపథ్యంలో, విజయ్ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో, టీవీకే సభ్యత్వ నమోదు ఈనెల 8వ తేది మహిళా దినోత్సవం రోజు నుంచి ప్రారంభించనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ముఖ్యంగా, పార్టీలో కార్యకర్తలను చేర్పించే విభాగం కార్యదర్శిగా మహిళా నేత ఉండడంతో, మహిళా దినోత్సవం రోజునే సభ్యత్వ నమోదు ప్రారంభించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల సమాచారం.

ప్రభుత్వ బస్సు కండక్టర్‌కు రూ.12,000 జరిమానా

పెరంబూర్, మార్చి 6: తిరునెల్వేలిలో ప్రయాణికుడి నుంచి రూ.37 అదనంగా వసూలుచేసిన ప్రభుత్వ బస్సు కండక్టర్‌కు వినియోగదారుల ఫోరం రూ.12,000 జరిమానా విధించింది. నాగర్‌కోయిల్ నుంచి తిరునెల్వేలికి వెళుతున్న బస్సులో ఎక్కిన మాణిక్యరాజ్... నాంగునేరికి టిక్కెట్టు అడిగాడు. కానీ, బస్సు ఆ ప్రాంతంలో ఆగదని తెలిపిన కండక్టర్, రూ.30 ఛార్జీకి బదులుగా రూ.67 వసూలు చేశారంటూ కండక్టర్‌కు వ్యతిరేకంగా మాణిక్యరాజ్ వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేశారు.

రూ.138 కోట్లతో ఒప్పందం

ఐసిఎఫ్, మార్చి 6: సీఎంఆర్‌ఎల్ రూ.138 కోట్లతో ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. స్థానిక కోయంబేడు మార్కెట్ నుంచి ఎల్కాట్ పార్కు వరకు 22 పై ఓవర్ మెట్రో రైల్వేస్టేషన్లలో విద్యుత్, అగ్నిమాపక, వెంటిలేటర్, ఎయిర్ కండిషన్ మెషిన్ల ఏర్పాటుకు యూనివర్సల్ మెబ్ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ సర్వీస్ సంస్థతో సీఎంఆర్‌ఎల్ ఒప్పందాలు కుదుర్చుకుంది.

పబ్లిక్ పరీక్షలకు హాజరుకాని విద్యార్థుల సంఖ్య తక్కువే

● పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, మార్చి 6: పబ్లిక్ పరీక్షలకు గైర్హాజయ్యే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. తంజావూరు జిల్లా ఒరత్తనాడులో మంగళవారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... గత ఏడాది పబ్లిక్ పరీక్షలకు సుమారు 50 వేల మంది విద్యార్థులు హాజరుకాకపోగా, ప్రస్తుతం ఆ సంఖ్య 10 వేల నుంచి 12 వేలలోపు ఉందన్నారు. ఒక్కో పాఠశాల నుంచి ఒకరు, ఇద్దరు మాత్రమే హాజరుకావడం లేదన్నారు. పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థులను గుర్తించి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చామని, వారిలో కొందరు పరీక్షలకు హాజర య్యారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఈనెల 1వ తేది నుంచి ప్రారంభం కాగా 25,000 వేలమంది చేరారన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతూ ఐదేళ్లు దాటిన 3.50 లక్షల మందిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు.

డీఎండీకే సీట్ల సర్దుబాటు చర్చల కమిటీ

పెరంబూర్, మార్చి 6: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు చర్చలకు సంబంధించి డీఎండీకే ప్రత్యేక కమిటీని నియమించింది. ఆ ప్రకారం, పార్టీ సంయుక్త కార్యదర్శి ఎల్కే సుధీష్, ప్రిసీడియం చైర్మన్ డాక్టర్ వి.ఇళంగోవన్, మాజీ ఎమ్మెల్యేలు అళగాపురం ఆర్.మోహన్‌రాజ్, పి.పార్థసారథిలతో కూడిన కమిటీ ఏర్పాటు చేసినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ కూటమిలో ఏఐఎస్‌ఎంకే

పెరంబూర్, మార్చి 6: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో తాము చేరామని ఆలిండియా సమత్తువ మక్కల్ కట్చి (ఏఐఎస్‌ఎంకే) ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, నటుడు శరత్‌కుమార్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమిలో చేరాలని గత నెల 28న రాష్ట్ర ఇన్‌చార్జి అరవింద్ మేనన్ తనతో సమావేశమయ్యారని, రెండో విడతగా మంగళవారం కేంద్ర మంత్రి మురుగన్, సీనియర్ నేత రాజా, అరవింద్ మేనన్‌తో చర్చించామనానరు. పోటీ చేసే సీట్లపై త్వరలో ప్రకటిస్తామని శరత్‌కుమార్ తెలిపారు.

నేడు ఎండీఎంకే అత్యవసర సమావేశం

పెరంబూర్, మార్చి 6: ఎండీఎంకే అత్యవసర సమావేశం గురువారం జరగనుంది. ఎగ్మూలోని పార్టీ ప్రధాన కార్యాలయం 'తాయగం'లో ఉదయం 10 గంటలకు జరగనున్న సమావేశానికి పార్టీ ప్రిసీడియం చైర్మన్ ఎ.అర్జునరాజ్ అధ్యక్షత వహించనున్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలు ప్రధాన అజెండాగా జరగనున్న సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు తప్పకుండా పాల్గొనాలని పార్టీ కోరింది. కాగా, పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఎండీఎంకే సీట్ల సర్దుబాటు, ప్రత్యేక చిహ్నంపై పోటీ తదితరాలు కొలిక్కి రాని నేపథ్యంలో, ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈడీ అధికారి అంకిత్ తివారి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, మార్చి 6: ప్రభుత్వ వైద్యుడి నుంచి రూ.20 లక్షలు లంచం తీసుకున్న వ్యవహారంలో అరెస్టయి జైలులో ఉన్న ఈడీ అధికారి అంకిత్ తివారి రిమాండ్‌ను పొడిగించింది. ఆయన రిమాండ్ బుధవారం ముగియడంతో మదురై జైలులో ఉన్న ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిండుగల్ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అంకిత్ తివారి రిమాండ్‌ను 7వ సారి ఈనెల 20వ తేది వరకు పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.





తిరువిక నగర్ జోన్‌లోని ఓట్టేరి నల్లా కాల్వలో డ్రోన్ల ద్వారా దోమల నివారణ మందు చల్లే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ తదితరులు

10వరకు చెన్నై సెంట్రల్-తిరుపతి రైళ్ల రద్దు

11నుంచి తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి

పెరంబూర్, మార్చి 6: తిరుపతి సెక్షన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా తిరుపతికి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేయగా, మరికొన్ని పాక్షికంగా, మరికొన్నింటిని ఇతర మార్గాల్లో నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. ● నెం.06728 తిరుపతి - మూర్ మార్కెట్ కాంప్లెక్స్, నెం.06727 మూర్ మార్కెట్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 10వ తేది వరకు రద్దు. ● నెం.16854 విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్, నెం.16853 తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 14వ తేది వరకు రద్దు. ● నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06754 తిరుపతి - అరక్కోణం మెమో రైళ్లు ఈ నెల 10వ తేది వరకు రద్దు. ● నెం.17407 తిరుపతి - మన్నార్‌గుడి పమని ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10, 12, 14 తేదీలు, నెం.17408 మన్నార్‌గుడి - తిరుపతి పమని ఎక్స్‌ప్రెస్ ఈనెల 11, 13, 15 తేదీల్లో రద్దు. ● నెం.16112 పుదుచ్చేరి - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 12 నుంచి 23 వరకు, నెం.16111 తిరుపతి - పుదుచ్చేరి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి 24వ తేది వరకు రద్దు.

తిరుపతికి బదులుగా తిరుచానూరు...

● నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 14వ తేది వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, నెం.06754 తిరుపతి ● అరక్కోణం మెమో ఎక్స్‌ప్రెస్, 06728 తిరుపతి - మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి బయల్దేరుతాయి.

రేణిగుంట వరకే సప్తగిరి ఎక్స్‌ప్రెస్...

● నెం.16057 చెన్నై సెంట్రల్ - తిరుపతి, నెం.16053 చెన్నై సెంట్రల్- తిరుపతి మధ్య నడిచే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 23వ తేది వరకు తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, నెం.16058 తిరుపతి- చెన్నై సెంట్రల్, నెం.16054 తిరుపతి - చెన్నై సెంట్రల్ సప్తగిరి రైళ్లు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతాయి.

రైల్వేగేట్ ధ్వంసం

రైళ్ల రాకపోకలకు అంతరాయం



సింగపెరుమాల్ కోవిల్ సమీపంలో దెబ్బతిన్న రైల్వే గేటు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్‌కోవిల్ సమీపంలో వ్యాన్ ఢీకొనడంతో రైల్వే గేట్ ధ్వంసమైంది. దీంతో చెన్నై - చెంగల్పట్టు మార్గంలో నడిచే ఎక్స్‌ప్రెస్, విద్యుత్ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు గంటలపాటు ఆ గేటు దాటుకుని వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కొంతమంది ప్రయాణికులు పట్టాలపై నడచుకుంటూ బస్టాండుకు వెళ్లి బస్సులు, ఆటోలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

మొబైల్ గేమ్ ఆడొద్దన్నందుకు...
8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 6: సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడడం తగ్గించాలని తల్లి మందలించడంతో మనస్థాపం చెందిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పల్లావరం జీఎస్‌టీ రోడ్డు సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కృష్ణన్‌కుమార్, శైలజ దంపతులకు వైష్ణవి అనే కుమార్తె, శ్రీరామ్ (14) అనే కుమారుడున్నాడు. శ్రీరామ్ అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శ్రీరామ్ కొద్దిరోజులుగా చదవకుండా సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతున్నట్లు తెలిసింది. దీంతో, పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయి. మంగళవారం రాత్రి కూడా శ్రీరామ్ చదవకుండా గేమ్ ఆడడాన్ని గమనించిన తల్లి... చదువుపై దృష్టి పెట్టాలని మందలించింది. దీంతో, మనస్తాపం చెందిన శ్రీరామ్ అందరూ నిద్రపోయిన తర్వాత అపార్ట్‌మెంట్ పై భాగానికి వెళ్లి కిందకి దూకాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పల్లావరం పోలీసులు కేసు నమోద చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల కళ్లలో కారం చల్లి ఖైదీ పరార్

పెరంబూర్, మార్చి 6: పోలీసుల కళ్లలో కారం చల్లి ఓ ఖైదీ పరారయ్యాడు. తూత్తుకుడి సుందరవేల్‌పురానికి చెందిన మహారాజా(30)పై పలు కేసులున్నాయి. గత నెల 20వ తేది విలాత్తికుళం - వేంబార్ రోడ్డులోని ఓ దుకాణం సమీపంలో ఒక వ్యక్తిపై మహారాజా కత్తితో దాడి చేశాడు. కేసు నమోదుచేసిన పోలీసులు ఈనెల 1న మహారాజాను గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. మంగళవారం హత్యాయత్నం కేసు విచారణ నిమిత్తం విలాత్తికుళం కోర్టుకు మహారాజాను తీసుకొచ్చిన పోలీసులు, విచారణ అనంతరం మళ్లీ అతనిని జైలుకు తీసుకెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. ఆ సమయంలో తన జేబులో దాచుకున్న కారాన్ని పోలీసులకు కళ్లలో చల్లిన మహారాజా అక్కడి నుంచి పారిపోయాడు. వడబాక్కం పోలీసులు మహారాజా కోసం గాలిస్తున్నారు.

భార్య విడిచి వెళ్లిందని ఎస్ఐ ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 6: భార్య విడిచి వెళ్లడంతో మనస్తాపం చెందిన ఎస్ఐ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నీలగిరి జిల్లా కోతగిరి సమీపం తూనేరి గ్రామానికి చెందిన భోజరాజన్(49) సోలూరు మఠం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్నాడు. ఆయనకు వివాహమై ఇద్దరు కుమార్తెలుండగా, మూడేళ్ల క్రితం విభేదాల కారణంగా భార్యను వదిలి తూనేరిలో తల్లిదండ్రులతో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో గత ఏడాది మే నుంచి సెలవుపై ఉన్నాడు. ఈ నేపథ్యంలో, మంగళవారం తల్లిదండ్రులు బయటకు వెళ్లిన సమయంలో భోజరాజన్ గదిలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు.

శునకాల దాడిలో 20 గొర్రెల మృతి



ఐసిఎఫ్, మార్చి 6: వేదన్‌తాంగల్ సమీపంలో శునకాల దాడిలో 20 గొర్రెలు మృతి చెందాయి. నెల్లి గ్రామానికి చెందిన రాజు 20 మేకలు, యతిరాజ్ 30 గొర్రెలు పెంచుతున్నారు. సోమవారం సాయంత్రం మేతకు వెళ్లి తిరిగొచ్చిన మేకలు, గొర్రెలను కొట్టానికి తరలిస్తుండగా, మందలో కొన్ని కనిపించలేదు. దీంతో ఇద్దరు చుట్టుపక్కల వెదికారు. గ్రామానికి కాస్త దూరంలో గాయపడిన స్థితిలో గొర్రెలను గుర్తించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక 20 గొర్రెలు మృతిచెందాయి. దాడికి పాల్పడిన శునకాలను బంధించాలని అధికారులను కోరారు.

ఎంఎస్‌ఎం థియేటర్ సీజ్

ఐసిఎఫ్, మార్చి 6: పన్ను బకాయి చెల్లించని తిరువొత్తియూర్‌లో ఉన్న ఎంఎస్‌ఎం థియేటర్‌ను అధికారులు సీజ్ చేశారు. తిరువొత్తియూర్ దక్షిణ మాడవీధిలో ఉన్న ఈ థియేటర్ 2019 నుంచి ఆరేళ్లుగా రూ.21.60 లక్షల ఆస్తి పన్ను బకాయి ఉంచింది. ఈ బకాయిలు చెల్లించాలని పలుమార్లు కార్పొరేషన్ రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసినా ఖాతరు చేయకపోవడంతో, ఆర్ఐ, అధికారులు థియేటర్‌ను సీజ్ చేశారు.

సెంథిల్ బాలాజి రిమాండ్ మళ్లీ పొడిగింపు

పెరంబూర్, మార్చి 6: సెంథిల్ బాలాజి రిమాండ్‌ను 24వ సారి ప్రత్యేక న్యాయస్థానం పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు బట్వాడా నిరోధక చట్టం కింద గత ఏడాది జూన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేసిన సెంథిల్ బాలాజి స్థానిక పుళల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఆయన రిమాండ్ బుధవారంతో ముగియడంతో జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరచగా, రిమాండ్ ఈ నెల 11వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఎస్.అల్లి ఉత్తర్వులు జారీ చేశారు.

మాదకద్రవ్యాల విక్రయం

63 మంది అరెస్ట్

పెరంబూర్, మార్చి 6: నగరంలో వారం రోజుల వ్యవధిలో గంజాయి సహా మాదకద్రవ్యాలు విక్రయించిన కేసుల్లో 63 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలలో 'డ్రైవ్ అగనెస్ట్ డ్రగ్స్' పేరుతో తనిఖీలు చేపడుతున్నారు. గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 5 వరకు మాదకద్రవ్యాల విక్రయాలపై 34 కేసులు నమోదు చేసి 63మందిని అరెస్ట్ చేశారు. వారినుంచి 82.89కిలోల గంజాయి, 1932 నొప్పి నివారణ మాత్రలు, రూ.78,140 నగదు, 10 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు శాఖ పేర్కొంది.

నగరంలోని ఆలయాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, మార్చి 6: నగరంలో ఆలయాలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపుకు పాల్పడినట్లు వార్తలు వెలువడ్డాయి. నగరంలోని ఆలయాలకు ప్రతిరోజు పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, నగరంలోని ఆలయాల్లో బాంబులు ఉంచినట్లు బెంగళూరు పోలీస్ కంట్రోల్ రూంకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు అందింది. 'Bomb Blast in Chennai Temple Soon' jaffersait@outlook.com అనే ఈ-మెయిల్ చిరునామా నుంచి ఈ బెదిరింపు వచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై బెంగుళూరు పోలీసులు నగర పోలీసు కార్యాలయానికి సమాచారం అందించారు. అదే సమయంలో ఈ-మెయిల్ పంపిన వారి కోసం సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు. కాగా, నగరంలోని ప్రైవేటు పాఠశాలలకు కొద్దిరోజుల క్రితం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే.

ఖరీదైన సైకిళ్ల చోరీ

ఘరానా దొంగ అరెస్ట్

పెరంబూర్, మార్చి 6: నగరంలోని అపార్ట్‌మెంట్లలో ఖరీదైన సైకిళ్లు చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. చూలైమేడు, ఆరుంబాక్కం సహా పలు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్ల ప్రాంగణాల్లో ఉంచిన ఖరీదైన సైకిళ్లు అదృశ్యమవుతున్నాయంటూ పోలీసులకు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన పోలీసులు, ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా, ఈ చోరీలకు పాల్పడుతుంది చూలైమేడుకు చెందిన పాత నేరస్తుడు సతీష్‌గా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పగటి పూట ఆయా అపార్ట్‌మెంట్లకు వెళ్లి ఖరీదైన సైకిళ్లను గుర్తించే సతీష్, రాత్రి వేళల్లో వాటిని చోరీ చేస్తున్నాడని తెలిసింది. సతీష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు 12 ఖరీదైన సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.



రాష్ట్రంలో సినిమా థియేటర్లకు గడ్డుకాలం

రాష్ట్రంలోని సినిమా థియేటర్లకు ఈ యేడాది గడ్డుకాలం కొనసాగుతోంది. కొత్త సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు ముగిసిపోగా, మూడో నెల ప్రారంభమైంది. ఈ కొత్త యేడాదిలో పలువురు అగ్ర హీరోల చిత్రాలు విడుదలవుతాయని, ఆ సమయంలో థియేటర్ల సందడి వాతావరణం నెలకొంటుందని ప్రతి ఒక్కరూ భావించారు. కానీ, పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. తొలి రెండు నెలల్లో రజనీకాంత్, కమలహాసన్, విజయ్, అజిత్, విక్రమ్, సూర్య, కార్తీ వంటి హీరోలు నటించిన చిత్రాలు విడుదలకు నోచుకోలేదు. సంక్రాంతికి ధనుష్ 'కెప్టెన్ మిల్లర్', శివకార్తికేయన్ 'అయలాన్' చిత్రాలు విడుదలకాగా, గత నెలలో జయం రవి నటించిన 'సైరన్' విడుదలైంది. వీటిలో 'అయలాన్', 'సైరన్' ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాయి. ఈ రెండు నెలల కాలంలో అనేక చిత్రాలు విడుదలైనప్పటికీ అవి ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి. దీంతో థియేటర్ల వద్ద ప్రేక్షకుల లేక బోసిబోయి కనిపిస్తున్నాయి. ప్రతి శుక్రవారం విడుదలవుతున్న చిత్రాలు థియేటర్లలో ఒకటి రెండు రోజులకు మించి ప్రదర్శనకు నోచుకోవడం లేదు. దీనికితోడు మార్చిలో విద్యార్థులకు పరీక్షా సమయం కావడంతో విద్యార్థులు థియేటర్ల వైపు కన్నెత్తి చూడడం లేదు. పైగా ఈనెల 22వ తేదీ నుంచి ఐపీఎల్ పోటీలు ప్రారంభంకానున్నాయి. దీంతో థియేటర్లలో ఈవెనింగ్ షోలు ప్రదర్శించడం అనుమానంగా మారింది. అసలే ప్రేక్షకులు లేక పగటి షోలనే రద్దు చేస్తున్న నేపథ్యంలో ఐపీఎల్ ప్రారంభమైతే ఈవెనింగ్, నైట్ షోలకు కూడా ప్రేక్షకుల రావడం అనుమానమేనని థియేటర్ యజమానులు వాపోతున్నారు. ఇదేపరిస్థితి కొనసాగితే ముున్ముందు మరిన్ని గడ్డుపరిస్థితులను ఎదుర్కోక తప్పదని వారు అభిప్రాయపడుతున్నారు.

చిత్రజ్యోతి

అవకాశాల కోసం ఎవరినీ సంప్రదించలేదు

నివేదా పేతురాజ్



చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు సినిమా అవకాశాల కోసం ఏ ఒక్క దర్శకుడిని, నిర్మాతను, హీరోను సంప్రదించలేదని యువ హీరోయిన్ నివేదా పేతురాజ్ అన్నారు. చిత్రపరిశ్రమకు చెందిన ఒక ప్రముఖుడు నివేదాకు విలాసవంతమైన గృహం కొనుగోలు చేసి ఇచ్చినట్టు సాగుతున్న ప్రచారంపై ఆమె స్పందించారు. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారు. తప్పుడు వార్తలను ప్రచారం చేసి ఒక యువతి జీవితాన్ని నాశనం చేయొద్దని కోరారు. తాను, తన కుటుంబం గత కొన్నేళ్లుగా దుబాయ్‌లో ఉంటున్నామన్నారు. తాను సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 20 చిత్రాల్లో నటించానని తెలిపారు. డబ్బులు సంపాదించాలనో, ఫలానా దర్శకుడి వద్ద పనిచేయాలనో చిత్రపరిశ్రమలోకి రాలేదన్నారు. ఇతరుల గురించి వార్తలు రాసేముందు నిజానిజాలు తెలుసుకోవాలని కోరారు. మీరో ఊహించుకుంటున్నట్టుగా తాను హైఫై గర్ల్ కాదని, సాధారణ యువతినని చెప్పారు. తన జీవితంలో కూడా ఎన్నో ఆటుపోట్లు ఉన్నాయని, మానసికంగా ఎంత దృఢంగా ఉన్నట్టు తెలిపారు. మీ కుటుంబాల్లో అక్కాచెల్లెలు తరహాలోనే తాను కూడా యువతినని చెప్పారు. తనపై అసత్య ప్రచారం చేసిన మీడియా మిత్రుల్లో ఇంకా మానవత్వం మిగిలే ఉందని, వారు నిజానిజాలు తెలుసుకుని వార్తలు రాయాలని నివేదా పేతురాజ్ కోరారు.

మూడేళ్ల తర్వాత...

● తెరపైకి ఆండ్రియా 'కా' చిత్రం

తమిళ చిత్రపరిశ్రమలో బిజీగా ఉండే హీరోయిన్లలో ఆండ్రియా ఒకరు. ఈమె నటించిన 'కా' చిత్రం మూడేళ్ల తర్వాత విడుదలకు నోచుకోనుంది. నిజానికి గత యేడాది ఈమెకు ఏమాత్రం కలిసిరాలేదని చెప్పాలి. ఆమె నటించిన 'అనల్ మేల్ పనితులి' 2022లో విడుదలైంది. ఆ తర్వాత ఆమె నటించిన పలు చిత్రాలు గత యేడాది విడుదలైనప్పటికీ.. ఆశించిన రీతిలో ప్రేక్షకాదారణ పొందలేదు. అయినప్పటికీ వరుస అవకాశాలు వస్తూనే ఉన్నాయి. ఇటు తమిళం, అటు తెలుగు భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణం పూర్తి చేసుకున్న 'కా' చిత్రం చాలా రోజుల తర్వాత విడుదలకు సిద్ధమైంది. ఆండ్రియా సోలో హీరోయిన్‌గా వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ పాత్రను పోషించారు. తన వృత్తిలో భాగంగా అడవి జంతువులను ఫొటోలు తీసేందుకు దట్టమైన అడవిలోకి వెళ్లి చిక్కుకుంటారు. అక్కడ ఉండే క్రూరమృగాల నుంచి ఆమె ఎలా బయటపడ్డారన్నదే ఈ చిత్ర కథ. షాలోం స్టూడియో పతాకంపై జాన్ మ్యాక్స్ నిర్మించగా, నాంజిల్ దర్శకత్వం వహించారు. ఇందులో ఆండ్రియాతో పాటు మారిముత్తు, కమలేష్ తదితరులు నటించగా, కెమెరా అరివళగన్, సంగీతం సుందర్ సి.బాబు.



ఆండ్రియా



19న విచారణకు హాజరుకండి

● నటి విజయలక్ష్మికి హైకోర్టు ఆదేశం

సినీ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ తనను పెళ్లి పేరుతో మోసం చేశారని, అందువల్ల ఆయనను తక్షణం అరెస్టు చేయాలంటూ సినీనటి విజయలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈనెల 18న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. తమిళ చిత్రపరిశ్రమకు చెందిన విజయలక్ష్మి, సీమాన్ గతంలో సన్నిహితంగా ఉన్నారు. మూడేళ్లపాటు సహజీవనం చేశారు. ఆ తర్వాత మనస్పర్థలు తలెత్తడంతో విడిపోయారు. ఇదిలావుండగా, తనను సీమాన్ అన్ని విధాలుగా మోసం చేశారంటూ ఆమె 2011లో చెన్నై నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ సీమాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో నగర పోలీస్ విభాగం నివేదికను కోర్టుకు సమర్పించింది. ఆ తర్వాత గీ యేడాది సెప్టెంబరు 29న ఈ పిటిషన్‌పై విచారణ జరగ్గా, విజయలక్ష్మి హాజరుకాలేదు. అప్పటి నుంచి ఈ కేసు పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం మరోమారు విచారణకు రాగా, ఈనెల 18న నటి విజయలక్ష్మి కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఇదిలావుండగా అన్ని విధాలుగా మోసపోయి ఒంటరిగా ఉన్న తాను ఆత్మహత్య చేసుకోనున్నట్టు విజయలక్ష్మి సోషల్ మీడియాలో గత నెల 29వ తేదీన ఓ వీడియోను షేర్ చేయగా, అది వైరల్ అయింది. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి మూడేళ్ళపాటు రహస్య జీవితాన్ని కొనసాగించిన సీమాన్... తన జీవితాన్ని నాశనం చేశారని, తనకు ఎవరైనా సహకరించినా వారిని బెదిరించి తరిమికొడుతున్నారని, ప్రస్తుతం తాను బెంగళూరులో ఒంటరిగా జీవించలేక ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు తెలిపారు.

మోదీ రాష్ట్రంలో తిష్ఠ వేసినా

బీజేపీకి ఓట్లు రాలవు: కనిమొళి



పెరంబూర్, మార్చి 6: ప్రధాని మోదీ రోజూ రాష్ట్రానికి వచ్చినా, ఇక్కడే ఇల్లు తీసుకొని బస చేసినా బీజేపీకి రాష్ట్రప్రజలు ఓటు వేయ్యరని డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవా చేశారు. విల్లివాక్కంలో డీఎంకే ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో కనిమొళి మాట్లాడుతూ... ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి వెళ్లిందన్నారు. అలాంటి పరిస్థితుల్లోనూ అన్ని రాష్ట్రాలకు దీటుగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అదే ద్రావిడ పాలన అన్నారు. కానీ, కొందరు పెద్దలకు ఈ పాలన నచ్చడం లేదన్నారు. సాక్షాత్తు గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను శాసనసభలో మాట్లాడలేని పరిస్థితుల్లో అర్థంతరంగా వెళ్లిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తుఫాను, భారీవర్షాలతో నష్టపోయిన జిల్లాలను ఆదుకొనేలా మోదీ ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. భారీవర్షాల నష్టాలను చూసేందుకు వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్.. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వరద నివారణ, సహాయక చర్యలను ప్రశంసించారని తెలిపారు. కానీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బాధిత ప్రాంతాలను పరిశీలించి వెళ్లినా ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. మెట్రోరైలు పథకానికి కేంద్రప్రభుత్వ ఆర్థిక సాయం ఎదురుచూడకుండా రాష్ట్రప్రభుత్వమే నిధులు అందిస్తోందన్నారు. విపత్తులతో నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించేందుకు రాని ప్రధాని... ప్రస్తుతం తరచూ రాష్ట్రానికి వస్తున్నారని, అవసరమైతే ప్రతిరోజు వస్తారేమోనని, అందుకు రానున్న పార్లమెంటు ఎన్నికలే కారణమన్నారు.

శ్రీరామచంద్రా వర్శిటీతో అతుల్యా సీనియర్ కేర్ ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న ఉమాశంకర్, కార్తీక్ నారాయణ్

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంరక్షణకు మెరుగైన సదుపాయాలతో ఇళ్లను నిర్మించే ప్రముఖ సంస్థ అతుల్యా సీనియర్ కేర్ పోరూరులోని శ్రీరామ చంద్ర ఉన్నత విద్యా పరిశోధన సంస్థ (డీమ్డ్ వర్శిటీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ వర్శిటీ ప్రాంగణంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో అతుల్యా సీనియర్ కేర్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కార్తీక్ నారాయణ్ మాట్లాడుతూ... వృద్ధులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడం, వారిలో మానసిక ప్రశాంతతను చేకూర్చే ఆరోగ్య నియమాలను పాటింపజేయడం వంటి సేవలను శ్రీరామచంద్రా వర్శిటీ అందిస్తుండడంతో వారి సేవలను వినియోగించుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. శ్రీరామచంద్రా వర్శిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ అతుల్యా సీనియర్ కేర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడంతో వృద్ధుల సంరక్షణ కోసం అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ డీన్ డాక్టర్ బాలాజీ సింగ్, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాక్కముడి, అతుల్యా సీనియర్ కేర్ మార్కెటింగ్ విభాగం డైరెక్టర్ కృష్ణ కావ్యా, హెచ్‌ఆర్ విభాగం ఉపాధ్యక్షుడు పన్నీర్‌సెల్వం తదితరులు పాల్గొన్నారు.

'ఆరుపడై వీడు' రెండో విడత తీర్థయాత్ర ప్రారంభం



పళని పర్వతాలయం వద్ద బస్సెక్కుతున్న వృద్ధులు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల (ఆరుపడై వీడు)కు రెండో విడత తీర్థయాత్ర బుధవారం ఉదయం పళని దండాయుధపాణి ఆలయం వద్ద ప్రారంభమైంది. ఆరుపడై వీడుగల్ తీర్థయాత్ర జనవరి 28న చెన్నైలో కందకోట్టమ్ నుంచి ప్రారంభమైంది. 60 నుంచి 70 యేళ్లలోపు వృద్ధులను తమిళుల ఆరాధ్యదైవం కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాలకు యేడాదికి ఐదుసార్లు 200మందిని తీర్థయాత్రగా తీసుకెళతారు. ఆ మేరకు పళని దండాయుధపాణి ఆలయం వద్ద రెండో విడత తీర్థయాత్ర బుధవారం ఉదయం ప్రారంభమైంది. దిండుగల్, తిరుప్పూరు, కోయంబత్తూరు, ఈరోడ్ తదితర ప్రాంతాలకు చెందిన 200 మంది వృద్ధులు ఈ తీర్థయాత్రకు బయలుదేరారు. తొలుత వీరందరూ పళని పర్వతంపైనున్న దండాయుధపాణిని దర్శించుకున్నారు. ఆటు పిమ్మట ఆలయ అధికారులు అందరినీ తీర్థయాత్రకు సిద్ధంగా ఉన్న బస్సులో ఎక్కించి వీడ్కోలు పలికారు. తీర్థయాత్రకు బయలుదేరిన వృద్ధులకు తగు సదుపాయాలు, సహాయాలు అందించటానికి దేవాదాయ శాఖ సిబ్బంది ఆ బస్సులో ప్రయాణించారు. ఈ తీర్థయాత్ర తిరుచెందూరు, పళముదిర్‌చోలై, తిరుప్పరంకుండ్రమ్, స్వామిమలై, తిరుత్తణి మీదుగా సాగి, చివరగా పళని పర్వతాలయం వద్ద ముగుస్తుందని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మహాభారతం పఠించాలి

● భువనచంద్ర పిలుపు



సమాపనోత్సవంలో సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న భువనచంద్ర తదితరులు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీవనయానంలో ప్రతి వ్యక్తీ ఒక్కసారైనా మహాభారతాన్ని పఠిస్తే ఉత్తమ జీవన విలువలు పెంపొందించు కొవచ్చని ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర అన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'కవిత్రయ భారతం వర్తమాన సమాజం సమాలోచనం' అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సమాపనోత్సవం బుధవారం సాయంత్రం జరిగింది. అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహా ప్రస్థాన పర్వాల పేరుతో నాలుగు సమావేశాలు నిర్వహించారు. పదమూడో సమావేశానికి డాక్టర్ మాదా శంకరబాబు, పద్నాలుగో సమావేశానికి ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ, 15వ సమావేశానికి డాక్టర్ పట్టపు శివకుమార్, 16వ సమావేశానికి డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. 15మంది పత్ర సమర్పణ చేశారు. చివరగా సమాపనోత్సవానికి పెరంబూరు తెలుగు సాహితీ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ టీఆర్ఎస్ శర్మ, తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావును ఘనంగా సత్కరించి ఆయన సేవలను అభినందించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. ఈ సదస్సులో వక్తలు సమర్పించిన వ్యాసాలు పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి అద్దేపల్లి పురుషోత్తం మాట్లాడుతూ... ఈ సదస్సు నేటి యువతలో మహాభారతం అధ్యయనం చేయాలని ఆసక్తిని కలిగిస్తుందని చెప్పారు. ప్రత్యేక అతిథి డాక్టర్ తోటకూర ప్రసాద్ ఇతిహాసాల ద్వారా జాతిపిత మహాత్మాగాంధీ, వివేకానందస్వామి స్ఫూర్తిని పొందారని చెప్పారు. గౌరవ అతిథి కేవీ రమణమ్మ సదస్సు ప్రత్యేక సంచిక తొలి ప్రతిని స్వీకరించారు. ఆత్మీయ అతిథి డాక్టర్ ఎం.వి. నారాయణగుప్తా మాట్లాడుతూ... విజ్ఞానం విజయానికి మార్గమని, అలాంటి మార్గాన్ని తెలియజేసేది మహాభారతం అని అన్నారు. మాధురి ఇంగువ మాట్లాడుతూ... అధర్మాన్ని ఓడించడమే మహాభారత సందేశమన్నారు. డాక్టర్ వాసిలి వసంతకుమార్ మాట్లాడుతూ మహాభారతంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఆచార్య ఎల్బీ శంకరరావు సమానోత్సవ సందేశమిస్తూ మహాభారతం చదివితే ఎన్నో రకాల ధార్మిక విషయాలు తెలుస్తాయన్నారు. సత్యవాఖ్య ప్రబంధమని, ధర్మార్థ, కామ మోక్షాలకు ఆకారం మహాభారతం అన్నారు. పురుషార్థాలకు సంబంధించి అనుమానం వస్తే మహాభారతాన్ని పఠిస్తే చాలన్నారు. చివరగా సీహెచ్ మాళవిక వందన సమర్పణ చేశారు.

మహిళల భద్రతపై అవగాహన ప్రదర్శన

ప్రపంచ రికార్డ్ సృష్టించిన మహిళా పోలీసులు



ధ్రువీకరణ పత్రాన్ని నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్‌కు అందజేస్తున్న వరల్డ్ రికార్డ్ యూనియన్ అధికారి షెరీఫా - సభలో ప్రసంగిస్తున్న నగర పోలీసు కమిషనర్



చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్ బుధవారం ఉదయం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమీపిస్తుండటంతో మహిళల భద్రతపై వినూత్న అవగాహన ప్రదర్శనను నిర్వహించింది. ప్రపంచ రికార్డు కోసం నిర్వహించిన ఈ ప్రదర్శనలో మహిళా పోలీసు ఉన్నతాధికారులు సహా 5050 మంది మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనను నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ప్రారంభించారు. నగర పోలీసు విభాగంలో మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన 'అవల్ పోలీసు హెల్పింగ్' యాప్, మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన నెంబర్లు 1091, 1098, 181, 100, 1253, 1930 తదితర టోల్‌ఫ్రీ హెల్పింగ్ నెంబర్ల ఆకారాలల్లో ఆకుపచ్చ, నీలం, ఎరుపు చొక్కాలు ధరించి మహిళా పోలీసులు ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనను తమ రికార్డులలో పొందుపరుస్తున్నట్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించిన వరల్డ్ రికార్డ్ యూనియన్ నిర్వాహకులు ప్రకటించారు. ఈ ప్రపంచ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని వరల్డ్ రికార్డ్ యూనియన్ అధికారి షెరీఫా నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్‌కు అందజేశారు.



నీలిరంగు చొక్కాలు, టోపీలు ధరించి లేడీ కానిస్టేబుళ్ల ప్రదర్శన



ఎరుపు చొక్కాలు, టోపీలు ధరించి ప్రదర్శన జరుపుతున్న లేడీ కానిస్టేబుళ్లు



టి.నగర్ పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహోత్సవాల్లో భాగం బుధవారం ఉదయం రథంపై, సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగుతున్న అమ్మవారు



డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రిలో 'రిలెక్స్ స్మైల్ ప్రో'

అడయార్, మార్చి 6: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ నేత్ర హాస్పిటల్ డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రిలో 'రిలాక్స్ స్మైల్ ప్రో' స్టూడియోను ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ హృద్రోగ నిపుణుడు, సినీ హీరో డాక్టర్ ధీరజ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఈ స్టూడియోను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్, రెఫ్రెక్టివ్ అండ్ కార్నియా ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సూసన్ జాకబ్, క్లినికల్ సర్వీసెస్ జోనల్ హెడ్ డాక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ... చెన్నై నగరవాసులకు అత్యాధునిక యంత్ర పరికరంతో వైద్య సేవలందించే రిలెక్స్ స్మైల్ ప్రోను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణ డొమైన్‌లో ఈ అత్యాధునిక సాంకేతిక నేత్ర సంరక్షణ ఇటీవల అందుబాటులో వచ్చిందన్నారు. డాక్టర్ అశ్విన్ అగర్వాల్ మాట్లాడుతూ... మయోపియా చికిత్సలో రిలెక్స్ స్మైల్ విప్లవాత్మక పురోగతిగా అభివర్ణించారు. ఈ అత్యాధునిక లేజర్ విజన్ కరెక్షన్ టెక్నిక్ గత యేడాది మాత్రమే అందుబాటులోకి వచ్చిందని, ఇపుడు చెన్నైలో తొలిసారిగా అగర్వాల్ హాస్పిటల్‌లో అందుబాటులోకి తెచ్చామని, రానున్న మూడు నుంచి ఐదేళ్లలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న తమ హాస్పిటళ్లలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇది పూర్తిగా ఏఐ ఆధారిత చికిత్స అని.. ఇది కేవలం పది సెకన్లలోనే పూర్తి అవుతుందన్నారు.. అయితే, 18 యేళ్లు నిండిన తర్వాత నుంచి మాత్రమే ఈ చికిత్స చేయడం వీలుపడుతుందన్నారు. ఈ విధానంలో ఒక కంటికి చికిత్స చేయడానికి రూ.75 వేల వరకు ఖర్చు అవుతుందని, ఎలాంటి కంటి అద్దాలు లేకుండా చూపు కనిపిస్తుందని డాక్టర్ రమ్య తెలిపారు.



'రిలెక్స్ స్మైల్ ప్రో' ప్రారంభోత్సవం